ప్రజాశక్తి

మంగళవారం 27 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

జాతీయ సమైక్యతా సదస్సులో

విరివిగా పాల్గొనండి..

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జాతీయ సమైక్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు సూచించారు. జూన్ ఒకటిన సాయంత్రం ఒంగోలు, సుందరయ్య భవనం ఆవరణలో జరిగే సదస్సులో విరివిగా పాల్గొని.. జయప్రదం చేయాలని కోరారు. సోమవారం నాడు స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ గత నెల 22న జరిగిన పెహల్గం ఘటనను ప్రధాని మోడీ మత రాజకీయం చేస్తున్న వైనం జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లేదిగా ఉందన్నారు. ఉగ్రవాదుల అణచివేత పేరున సాగిన పాకిస్తాన్ యుద్ధం అంశంలో, కాల్పుల విరమణ విషయంలో ఆపరేషన్ సింధూర్ అంశంలో ట్రంప్ జోక్యం విమర్శలకు తావిస్తోందన్నారు. ఉగ్రవాద చర్యలను మతాలకు ఆపాదించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. యుద్ధం వద్దు, శాంతి సామరస్యంతో పరిష్కారం చేసుకోవాలని సూచించిన కమ్యూనిస్టులను శత్రువులుగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ట్రంప్‌నే విశ్వ గురువుగా భావించి సలాం ▶ 2లో

'మార్కాపురం జిల్లా' తథ్యమేనా.?

- జిల్లా మహానాడులో తీర్మానంతో జనంలో ఆశలు
- మంత్రుల కమిటీపైనా కొనసాగుతున్న తర్జనభర్జనలు
- రాష్ట్ర మహానాడులో మరోసారి ప్రస్తావనకు తెస్తేనే ముందుకు..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశంపై ఏడాదికి పాలకపక్షంలో కదలిక వచ్చింది. ఇప్పటివరకూ దాని గురించి అతీగతీ లేదు. అయితే ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయకపోతే నష్టపోతామనే ఆందోళన పశ్చిమాన పాలకపక్ష నేతల్లో పెరుగుతోంది. మంత్రుల పర్యటనల్లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నారు. సిఎం చంద్రబాబు పర్యటనలోనూ ప్రస్తావనకు వచ్చింది. ఆయన కూడా జిల్లా ఏర్పాటు చేస్తామని మరోసారి హామీ ఇచ్చారు. అయితే దానికి సంబంధించిన చర్యలు మాత్రం అధికారికంగా కనిపించలేదు.

తాజాగా జరిగిన కేబినెట్‌లో ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తూ తీర్మానం చేశారు. కమిటీ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశాక ఇచ్చే నివేదిక ఆధారంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు జరుగుతుందని భావించారు. మార్కాపురం జిల్లా అంశం తెరపైకి వచ్చిందనే చర్చ సాగుతోంది.

అదే తరుణంలో మొన్న జరిగిన జిల్లా మహానాడులో పశ్చిమప్రాంత ఎమ్మెల్యేలు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన అవసరాన్ని తమ ప్రసంగాల్లో ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో ఆ జిల్లా ఏర్పాటుపై తీర్మానం కూడా చేశారు. ఇప్పుడు రాష్ట్ర మహానాడు జరుగుతోంది. అక్కడా ఈ అంశాన్ని జిల్లా నేతలు ప్రస్తావించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇక మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశారు. సహజంగా కమిటీలు అంటే కాలయాపనకేననే చర్చ ఉంటుంది. ఇది కూడా అదే కోవకు చెందుతుందా? వెంటనే రంగంలోకి దిగి అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందా? అనేదీ చూడాలి. గతంలో జిల్లాల ఏర్పాటు అనే ప్రక్రియ పార్లమెంటు ఆధారంగా చేశారు. కొన్ని మార్పులు చేర్పులు జరిగాయి. సంతనూతలపాడు నియోజకవర్గాన్ని మాత్రం ప్రకాశం జిల్లాలోనే ఉంచారు.

అప్పట్లో మార్కాపురం జిల్లా కోసం వైసిపి తప్ప అన్ని పార్టీలూ ఆందోళన చేపట్టాయి. అనివార్యంగా పశ్చిమప్రాంత వైసిపి ఎమ్మెల్యేలు అప్పటి సిఎం జగన్‌కు లేఖలు రాశారు. ఎందుకంటే స్థానికంగా నష్టపోకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. మార్కాపురం జిల్లాకు మద్దతుగా అప్పటి మంత్రి సురేష్ కూడా లేఖ రాశారు. ఇవన్నీ వ్యూహాత్మకం. అన్ని పార్టీల్లో మార్కాపురం జిల్లా నినాదమే వినిపించింది. తెలుగుదేశం నేతలూ కీలకపాత్ర పోషించారు. దీంతో ▶ 2లో

న్యాయం జరగట్లేదని..

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగి గ్రీవెన్స్‌కు వచ్చిన మహిళ
- జిజిహెచ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తన సమస్యకు న్యాయం జరగట్లేదని ఓ మహిళ ఆత్మహత్యా యత్నం చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం లోపల పురుగుమందు తాగి గ్రీవెన్స్‌కు వచ్చిన మహిళను గుర్తించిన స్థానికులు పోలీసుల సహాయంతో ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వివరాలు పరిశీలిస్తే త్రిపురాంతకం గ్రామానికి చెందిన ఎరుకుల కుల స్తురాలు పేరం సౌభాగ్యమ్మ(46)కు ఐదు సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలాన్ని సొంత అన్నదమ్ములు ఆక్రమించుకొని ఆమెను స్థలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలు మార్లు సౌభాగ్యమ్మ గ్రీవెన్స్‌సెల్, ఎస్‌పి మీకోసం కార్యక్రమంలో ▶ 2లో

పురుగుమందు తాగిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

పొగాకు రైతుల కోసం

పర్చూరులో కంట్రోల్‌రూమ్

- బ్లాక్ బర్లీ పొగాకుని కంపెనీలు వేగంగా కొనేలా చర్యలు
- కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బ్లాక్‌బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి కోరారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం స్థానిక పిజిఆర్‌ఎస్ హాలులో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కోసం పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పొగాకు రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్లాక్‌బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందన్నారు. పొగాకు కొనుగోలుపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగాకు కొనుగోలు తర్వాత పంట నిల్వ చేయడానికి అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాల మేరకు పొగాకు కొనుగోళ్లు జరగాలన్నారు. అలాగే ధాన్యం సేకరణ వేగం పుంజుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 33,200 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగ్గా, ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు.

కలెక్టర్ వెంకటమురళి

నేడు బాపట్లలో యోగాంధ్ర

యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా మంగళవారం భావపురి గుడి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై యోగాసనాల జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 31వ తేదీన సూర్యలంక సమీపంలోని అటవీ శాఖ నగర వనంలో భారీ స్థాయిలో యోగాసనాల కార్యక్రమం జరపాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమంపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. పంపిణీలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు, ధ్రువీకరణ పత్రాలు సేకరించాలన్నారు. జూన్ 22 తర్వాత గ్రామీణ ప్రాంతాలలోని రహదారుల వెంట చెత్త కనిపించరాదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

- బాపట్లలో వాహనాలతో ర్యాలీ

ఎండియు వాహనాలతో ర్యాలీ

కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

మండల డిస్ట్రిబ్యూషన్ యూనిట్(ఎండియు) వాహనాలను కొనసాగించాలని కోరుతూ ఎండియు రేషన్ వాహనాలతో బాపట్లలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి సాగింది. ర్యాలీ కలెక్టరేట్ వద్ద చేరుకున్న అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్ మాట్లాడుతూ వాహనదారులకు, అసిస్టెంట్లకు ఉపాధి కల్పించాలన్నారు. ఎండియూ వాహనాల ద్వారా పేద ప్రజలకు ప్రతినెలా బియ్యం, నిత్యవసర వస్తువులు అందిస్తున్నారని, ఆయా వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి సమాచారం లేకుండా జూన్ ఒకటి నుండి వాహనాలను నిలిపివేస్తున్నట్లుగా ▶ 2లో

ఉరేసుకొని నవ వధువు ఆత్మహత్య

ప్రజాశక్తి-మద్దిపాడు

అనారోగ్యం కారణంగా ఉరేసుకొని నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివరామయ్య వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన పూజితకు కందుకూరుకు చెందిన వెంకట ఫణింద్రతో ఈ ఏడాది మార్చి 11న వివాహం జరిగింది. మూడు రోజుల క్రితం భర్తతో పుట్టింటికి వచ్చింది. అప్పటినుంచి కడుపు నొప్పితో బాధపడుతూ ఉంది. సోమవారం స్నానం చేస్తానని బాత్రూంకి వెళ్లి ఎంతసేపటికి డోర్ తీయకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు డోర్‌ను తొలగించి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

కొప్పోలులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగర పరిధిలోని కొప్పోలులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఒంగోలు కార్పొరేషన్ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సూచన మేరకు సోమవారం నుంచి ఐదు డివిజన్లలో ఈ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం చేశామని మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి వార్డులో 5 నుండి 6 రోజులు ఈ శుభ్రతా కార్యక్రమం జరుగుతుందన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని.. దోమల నివారణ కోసం, డ్రైనేజీ లు శుభ్రం చేసి.. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పాల్గొన్నారు.

'మార్కాపురం జిల్లా' తథ్యమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో మార్కాపురం ప్రాంతానికి ప్రతిపక్ష నేతగా వచ్చిన చంద్రబాబు కూడా జిల్లా ఏర్పాటుపై హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు జరిగిన కార్యక్రమాలు, లోకేష్ పాదయాత్ర, చంద్రబాబు ఎన్నికల సభల్లోనూ మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. ఈ అంశాన్ని పక్కనబెట్టేశారు. జిల్లాల ఏర్పాటు అంశంపై అధ్యయనం చేయాలని, చాలా డిమాండ్లు ఉన్నాయని, పరిశీలన చేయాలనే కారణాలు చూపి ఇప్పటి వరకూ వాయిదా వేస్తూ వచ్చారు. అయితే దీనిపై పాలకపక్షంలోనే తర్జనభర్జన సాగుతోంది. ఇచ్చిన హామీ అమలుచేయకపోతే మనకూ, వైసిపికి తేడా లేదనే చర్చ సాగుతోంది. చంద్రబాబు ఇచ్చిన హామీని అమలుచేసేందుకు కమిటీ వేశారని మహానాడులో చెప్పుకున్నారు. అయితే ఆచరణలో జిల్లా ఏర్పాటు పెద్ద కష్టంతో కూడుకున్న అంశంగా లేదు. అప్పట్లో అన్నీ తెలిసే హామీ ఇచ్చారు. అప్పటి ప్రభుత్వం పార్లమెంటు స్థానాల వారీగా ప్రకటించి గజిట్ జారీ చేసింది. ఇప్పుడు ప్రకాశంలో అద్దంకి, కందుకూరును కలిపి ఐదు నియోజకవర్గాలతో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేస్తే మిగిలిన ఐదు నియోజకవర్గాలతో మార్కాపురం ప్రకటించవచ్చు. పైగా మార్కాపురం డివిజన్‌లో ఆఫీసులు కూడా ఉన్నాయి. పూర్తిస్థాయిలో నడవని ఇంజనీరింగ్ కాలేజీలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆఫీసులకు వినియోగించుకోవచ్చు. ఈ తరుణంలో కమిటీ వేయడంపై మిశ్రమ స్పందన వస్తోంది. కాలయాపనకా? లేక ఏదో చేస్తున్నామనే చర్చ కోసమా? అనేదీ చూడాలి. ఏదేమైనా తెలుగుదేశం రాష్ట్ర మహానాడులో ఈ అంశాన్ని ఎజెండాలో చేర్చితే తప్ప ఈ అంశం ముందుకు సాగేలా కనిపించడం లేదు.

బాలికపై అత్యాచారం కేసులో

నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరం నవంబర్‌లో 9వ తరగతి చదువుతున్న బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శైలజ సోమవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వేటపాలెంలో తన తల్లితండ్రులతో పాటు నివాసం వుంటూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుకుంటున్న 13 సంవత్సరాల మైనర్ బాలికను వారి ఇంటి సమీపంలో వుండే తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు మాయ మాటలతో లోబరుచుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. ముద్దాయి నిర్వహిస్తున్న సిమెంట్ రాళ్ల తయారీ ప్రదేశంలో ఆడుకోవడానికి వెళ్ళే మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారంకు పాల్పడ్డాడు. ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించడంతో జరుగుతున్న దారుణం గురించి బాలిక ఎవ్వరికీ చెప్పలేదు. ఈ ఘటనపై 2023 నవంబర్ 17న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వేటపాలెం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ జి.సురేష్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ అధికారి, అప్పటి చీరాల డిఎస్పీ ఎస్ ప్రసాద రావు నేర స్థలాన్ని సందర్శించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి నేరం చేసినట్లు తగిన సాక్ష్యాధారాలతో నిరూపించి 2023 నవంబరు 18న ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చార్జ్ షీట్ ఫైల్ చేశారు.

ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్ట్‌లో కేసు విచారణకు రాగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్రీనివాసరావు కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు. వాదోపవాదనలు విన్న ప్రత్యేక ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శైలజ ముద్దాయికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష మరియు రూ.10 వేలు జరిమానా విధిస్తు సోమవారం తీర్పు ఇచ్చారు. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వ తరపున రూ 6 లక్షల నగదు పరిహారం చెల్లించే విధంగా ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై జరిగే నేరాల మీద ప్రత్యేక దృష్టి సారించి కోర్టు ట్రైల్ మానిటరింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కఠిన కారాగార శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది మరియు పీపీని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యా యత్నం

(మొదటిపేజీ తరువాయి)

అర్జీలు ఇచ్చి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఎస్పి కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో త్రిపురాంతకం ఎస్సై ఈ కేసును విచారించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్కడ కూడా న్యాయం జరగకపోవటంతో గత మూడు వారాలు సౌభాగ్యమ్మ గ్రీవెన్స్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సౌభాగ్యమ్మ ప్రకాశం భవనం లోపల కొంత పురుగుల మందు సేవించి వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన వచ్చి ఇంటి స్థలం ఆక్రమణ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. గతంలో కూడా సౌభాగ్యమ్మ ఆత్మహత్య యత్నానికి పాల్పడటం గమనార్హం. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న సౌభాగ్యమ్మ ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు తెలియజేశారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2,38,162

ప్రజాశక్తి-సిఎస్.పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.2,38,162 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా రూ.1,16,718, ప్రసాదాలు అమ్మకం ద్వారా రూ.37,120, శాశ్వత అన్నదానమునకు రూ.59,260, పంచామృతాభిషేకమునకు రూ.22064 స్వామి వారి పాద కానుకల ద్వారా రూ.3 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3 వ ఆదనపు జిల్లా జడ్జి కం మోటార్ వెహికల్స్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ :: కర్నూలు AT నంద్యాల
MVOP NO.359/2015
వేల్పుల కాసేమ్మ ....పిటిషనర్స్
V/S
పఠాన్ మహబూబ్ శరీఫ్ & ఇతరులు ..ప్రతివాదులు
5వ రెస్పాండంట్ :
వేల్పుల వెంకట శివరామిరెడ్డి తండ్రి బాల చెన్నారెడ్డిజి
7వ రెస్పాండంట్ :
వేల్పుల వెంకట్రాంరెడ్డి తండ్రి బాల చెన్నారెడ్డి
పై ఇద్దరి అడ్రస్ : తిమ్మాపురం గ్రామం గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.
R5 & R7 ప్రతివాదులకు నోటీసు
పైన కనబర్చిన అర్జీదారులు, తన భర్త యాక్సిడెంట్లో చనిపోయినందున నష్టపరిహారం కోరకు దాఖలుచేసిన పై నెంబర్ అర్జీ నందు 5&7వ రెస్పాడెంట్స్ అయిన మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు నందు 26/06/2025 వ తేదిన మీరు గాని మీ తరఫువకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను లేనియెడల, మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తరువుల మేరకు)
వాయిదా తేదీ : 26/06/2025
ఇట్లు
టి. మహమ్మద్ రఫీ
పిటిషనర్ తరపు న్యాయవాది
నంద్యాల : 9440079812

ఎండియు వాహనాలను కొనసాగించాలి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ వాహనాల ద్వారా 18,520 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఉపాధి దొరుకుతుందని ఇంటర్మీడియట్, డిగ్రీలు చదువుకున్న అనేకమంది యువకులు దీనిలో ఉపాధి కోసం అందులో చేరారన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో అకస్మాత్తుగా వీటిని రద్దు చేయడం సరైన చర్య కాదని అన్నారు. 2027 జనవరి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఒప్పందం చేసుకొని, నేడు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి వాహనాలను నిలిపి వేయటం సరైన చర్య కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న షాపుల్లో ఈ వాహనాల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని చెప్పున్నారని ఈ అక్రమాలు ఆపటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. అక్రమాలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, వాటిని కప్పిపుచ్చుకోవడానికే ఈ వాహనాల రద్దుని తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ విధానాన్ని కొనసాగించి.. లోపాలు ఉంటే సరిచేయాలన్నారు. ఎండియు వాహనాలను కొనసాగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శరత్, ఎండియు వాహనాల జిల్లా నాయకులు ధార దేవస హాయం, గోపి, పేర్ని రమేష్, మేకల రాజేష్, రాఘవ పాల్గొన్నారు.

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి నా క్లయింట్ జాజం సరస్వతి తెలియపరచటం ఏమనగా. నా భర్త జాజం శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, సురేఖ అనువారలు తనను మోసంచేసి నమ్మించి ఆమె పేరుతో ఉన్న స్థలం, బంగారం మరియు నా కూతురు జాజం జ్యోత్స్న బంగారం కెనరా బ్యాంకులో తాకట్టుపెట్టి వచ్చిన డబ్బుతో పై తెలిపిన ముగ్గురి వారి పేరుతో వి.ఆర్.ఎన్.కె అపార్ట్మెంట్ 3వ ఫ్లోర్ లో ఫ్లాట్ నెం.303 కొనుక్కొని నన్ను నా కూతురిని మోసం చేయుచున్నారు. సదరు ఫ్లాటును అమ్మాలని చూచుచున్నారు. కావున సదరు ఫ్లాటును పై తెలిపిన జె.శ్రీనివాసరావు, జె.కిరణ్ కుమార్ జె సురేఖలు వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆ ఫ్లాటు అమ్మి డబ్బు చేసుకోవాలని, బ్యాంకు తనఖాలో ఉన్న నగలు వేలంకు తెచ్చి మమ్మల్ని రోడ్డుపాలు చేయాలని చూస్తున్నారు. కావున సదరు ఫ్లాటును ఎవరైనా అమ్మినను, కొనిన ఎడల వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును, ఎటువంటి రిజిష్టరులు నా క్లయింట్ సరస్వతిని బద్ధపరచవు.
హద్దులు : సర్వే నెం.608/4బి రులో
తూర్పు : బి. సీతారామిరెడ్డి
దక్షిణం : కె.కమలకుమారి మరియు వి.వి. శివలక్ష్మి
పడమర : 40 అడుగుల రోడ్డు
ఉత్తరం : బత్తినేని తిరుపతిస్వామి
ఇట్లు
టి.శివ, అడ్వకేట్,
కోర్ట్ సెంటర్, ఒంగోలు,
సెల్: 8885618580

జాతీయ సమైక్యతా సదస్సులో విరివిగా పాల్గొనండి..

(మొదటిపేజీ తరువాయి)

కొడుతున్నారని, ఆపరేషన్ సింధూర్ జయప్రదం అయిందని ప్రకటించాక కూడా కాల్పులు ఎందుకు జరిగాయని, ఉన్నట్లుండి ఎందుకు విరమించారన్న ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడంలో భారత ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసమే కాల్పుల విరమణ చేసినట్లు ట్రంప్ తాజాగా ప్రకటించారని.. మొత్తం ఈ ఘటనను పార్లమెంటు సమావేశం జరిపి మోడీ వాస్తవాలను ప్రజలకు ప్రకటన చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

తెలుగుదేశం ఎన్డీఏ భాగస్వామిగా బిజెపి మతోన్మాదానికి వంత పాడుతోందన్నారు. తిరంగా యాత్ర పేరుతో బిజెపి పిలుపునిస్తే రాష్ట్రంలో, అధికారులు అధికారిక కార్యక్రమంగా మార్చి లౌకిక శక్తులెవరినీ కలుపుకోకుండా ప్రజల్లో మతోన్మాదాలకు ఆదరణ కల్పిస్తోందని ఆరోపించారు. మోడీకి తల్లొగ్గిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా మాట్లాడటం లేదన్నారు. తెలుగుదేశం, వైఎస్ఆర్‌పి, జనసేన పార్టీలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులు మతోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యం, దేశ సమైక్యత ,రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందుకు రావాలని సిపిఎం పిలుపునిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ ఒకటిన ఆదివారం సాయంత్రం 5 గంటలకు సుందరయ్య భవనం ఆవరణలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ కె.ఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు. మధ్యతరగతి అభ్యుదయ శక్తులు, లౌకికవాదులు, మతసామరస్యాన్ని కోరుకునేవారు, వివిధ తరగతుల ప్రజానీకం అందరూ కూడా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో స్వచ్ఛమైన రక్షిత మంచినీరు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. అర్హులు పేదలకు రెండు సెంట్లు ఇవ్వాలని అనర్హుల పేరుతో సుమారు పదివేల మందిని తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని, అర్హులైన ప్రతి పేదవాడికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ స్థానిక సమస్యలపై ఆందోళనకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర నాయకులు తంబి శ్రీనివాసులు, బివి రావు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఊరేగింపును అడ్డుకున్న

నిందితులను అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఊరేగింపు అడ్డుకున్న నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కె.బిట్రగుంటలో అంబేద్కర్,బుద్ధుడి ఊరేగింపును అడ్డుకున్న అగ్రకుల నిందితులను అరెస్టు చేయాల, అగ్రకులాలకు కొమ్ము కాసిన జరుగుమల్లి ఎస్ఐ మహేంద్రను సస్పెండ్ చేయాలని కోరుతూ కెవిపిఎస్, దళిత సంఘాలు, జెఎసి ఆధ్వర్యంలో ఒంగోలులో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకుడు నీలం నాగేంద్రరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్, మాల ఉద్యోగుల సంఘాల జెఎసి నాయకులు తుల్లిబిల్లి అశోక్ మీడియాతో మాట్లాడారు. బుద్ధ జయంతి రోజున జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో ఎస్‌సి యువకులు బుద్ధుడి చిత్రపటంతో ఊరోగింపు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన అగ్రకులస్తులు కొందరు బుద్ధుడి ఊరేగింపును అడ్డుకున్నారన్నారు. గ్రామ నాయకులు కొందరు ఎస్‌సి యువకులను దూషించి దౌర్జన్యం చేసి బెదిరించారని తెలిపారు. దీనిపై జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

అయినప్పటికీ ఎస్ఐ కేసు నమోదు చేయలేదన్నారు. అంబేద్కర్ ఊరేగింపును అడ్డుకున్న వీడియో ఈనెల 22న వైరల్ కావడంతో 23న ఆ గ్రామానికి దళిత సంఘ నాయకులు వెళ్లి బాధిత యువకులతో మాట్లాడారన్నారు. 24న దళిత నాయకులు నీలం నాగేంద్ర, కెవిపిఎస్ నాయకుడు రఘురామ్, మాల సంఘాల జేఏసీ నాయకులు తుల్లిబిల్లి అశోక్, జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేసినట్లు గుర్తు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో జరుగుమల్లి ఎస్ఐ ఫిర్యాదు చేసిన నెల రోజుల తర్వాత మొక్కుబడి సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు. తొలుత అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయ త్నించగా టూ టౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిరసనకారులను అడ్డుకున్నారు. చివరకూ పదిమంది ప్రతినిధి బందాన్ని కలెక్టర్ వద్దకు అనుమతించారు. నాయకులు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కు వినతి పత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ ఈ ఘటనపై జరిగిన సంఘటనపై జిల్లా ఎస్‌పి లెటర్ రాస్తామని తెలిపారు. డిఆర్ఓ, ఆర్‌డిఓ చేత జాయింట్ ఎంక్వయిరీ జరిపిస్తామని హామీ ఇచ్చారు.. కలెక్టర్ ను కలిసిన వారిలో కెవిపిఎస్ నాయకుడు బి. రఘురామ్, మాల సంఘాల జేఏసీ నాయకులు తుల్లిబిల్లి అశోక్, ఏడుకొండలు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ,డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువాది సుబ్బారావు, ఐఎల్‌పి నాయకులు దాసరి సుందరం, మేడిది రవి, న్యాయవాదులు నూకతోటి రవికుమార్, అట్లూరి రాఘవులు,కెవిపిఎస్ నాయకుడు మోజేష్, ఒపిడిఆర్ నాయకులు సుధాకర్, నల్లపు కోటి, బహం తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి- టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 433 పొగాకు బేళ్లను సోమవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 379 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 54 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.255-13 పైసలు పలికింది. పొగాకు వేలంలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి జువ్విగుంట, అయ్యవారిపాలెం, జాళ్లపాలెం, పీరాపురం, తంగెళ్ల గ్రామాలకు చెందిన రైతులు 751 అమ్మకానికి తెచ్చారు. అందులో 628 అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 123 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.200, సరాసరి ధర రూ. రూ.239.17 పైసలు పలికింది.

దేవస్థానం వార్షికోత్సవం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వేరోడ్డులోనున్న శ్రీ చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానం 28వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కలువ పూలను పుష్పయాగంలో వినియోగించారు. తొలుత పుష్పయాగం కోసం తెచ్చిన పూలను మహిళలతో ఊరేగించారు. అనంతరం శ్రీనివాస కల్యాణం, లక్ష్మినారాయణస్వామి కళ్యాణం నిర్వహించారు.

కారును ఢీకొన్న లారీ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

లారీ ఢీకొనడంతో కారు బోల్తా కొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపైఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఒంగోలు వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు, రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు, చిలకమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. శింగరాయకొండ ఎస్ఐ బి.మహేంద్ర, హైవే మొబైల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో కారును బయటకు తొలగించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఎస్ఐ బి. మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలకు

ఆధార్ లింకు కోసం ప్రత్యేక మేళా

ప్రజాశక్తి.- ఒంగోలు సిటీ

ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ప్రతి ఖాతాదారుడు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అను సంధానం చేసుకోవాలని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఎండి. జాఫర్ సాధిక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రకాశం తపాలా డివిజన్ పరిధిలో 11,108 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు ఆధార్(నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తో అనుసంధానం కాలేదని తెలిపారు. రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు రానున్న రోజుల్లో ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని నగదు బదిలీ ప్రక్రియ పోస్టల్ శాఖ (డిబిటి) ద్వారా లబ్ధిదారులకు అందజేయడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.పథకాలను పొందడానికి లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలన్నారు.ప్రకాశం తపాలా డివిజన్ పరిధిలో 451 పోస్ట్ ఆఫీసులు ఉన్నాయని తపాలా శాఖ వారు, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలు ఆధార్ తో అనుసంధానం చేసేందుకు ఈ నెల 31 నుండి జూన్ 4 వరకూ ప్రతి గ్రామ సెక్రటేరియట్ / వార్డు సెక్రటేరియట్ పరిధిలో ప్రత్యేక మేళాలు నిర్వహించుచున్నట్లు తెలిపారు. ఆధార్ అనుసంధానికి ఆధార్ మరియు మొబైల్ నెంబర్ సరిపోతుందని తెలిపారు. కేవలం ఒక్క నిమిషంలోనే లబ్ధిదారుడి ఖాతాను ఆధార్ తో అనుసంధానం చేస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని పోస్ట్ ఆఫీసులో సంప్రదించాలన్నారు.

'మీకోసం'కు అధికారుల డుమ్మా

ప్రజాశక్తి-మద్దిపాడు : తహశీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి తహశీల్దారు తప్ప ఇతర అధికారులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. తహశీల్దారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. మీ కోసం కార్యక్రమానికి అధికారులు హాజరు కావడంపై ప్రజలు గుస గుసలాడారు. ఇకనుంచి అయినా మీకోసం కార్యక్రమానికి అధికారులు హాజర్యయేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

జూన్ 1 నుంచి పండుగ వాతావరణంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారు రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఒకటో తేది నుంచి 15 వరకూ రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. డీలర్లు తమ పరిధిలోని కార్డుదారులకు ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకూ బియ్యం పంపిణీ చేయాలన్నారు. 12 గంటల నుంచి నాలుగు గంటల వరకూ వద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి 8 గంటల వరకూ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. దుకాణాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. రేషన్ పంపిణీ సమయాల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడదని తెలిపారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం అడిగిన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని, బియ్యం లేవు అనే మాట రాకూడదని చెప్పారు. సివిల్ సప్లై ఆర్ఐ వంశీ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. స్టాక్ ను ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలన్నారు. తహశీల్దారు నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండియు ఆపరేటర్లను తొలగించి పాత పద్ధతిలోనే బియ్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణం తీసిన ఈత సరదా

ప్రజాశక్తి -పర్చూరు

ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన పర్చూరులోని ఇందిరా కాలనీలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇందిరా కాలానికి చెందిన జొన్నలగడ్డ మోహన్ కుమార్(24)అనే యువకుడు కాలనీ సమీపంలోని శ్రీవారి పుట్ట వద్దనున్న పర్చూరు వాగులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. వాగులో దిగి ఈత కొడుతున్న సమయంలో నీటి మునిగాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఎస్ఐ మాల్యాద్రి, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులు, చీరాల ఫైర్ స్టేషన్ రెస్క్యూ టీం సాయంతో వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్న సమయంలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మ దేవస్థానంలో చోరీ

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీలోని రూ.10 వేల నగదు, గర్భగుడిలో రూ.40 వేల విలువైన ఆభరణాలను అపహరించారు. ఈ విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.అనూక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్యూస్‌టీం, డాగ్ స్కాడ్‌ను పిలిపించి ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలనువ నియమించినట్లు ఎస్ఐ తెలిపా

బాలికపై అత్యాచార యత్నం కేసులో వృద్ధుడు అరెస్టు

ప్రజాశక్తి-కంభం రూరల్

బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించిన కేసులోని వృద్ధుడిని అరెస్టు చేసినట్లు కంభం ఎస్ఐ బి.నరసింహారావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండల పరిధిలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన శవరయ్య అనే వృద్ధుడు అదే గ్రామంలోని దళిత కాలనీకి చెందిన బాలికతో నిత్యం ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడేవాడు. ఈ నెల 23న మధ్యాహ్నం సమయంలో బాలిక ఒక్కటే ఇంట్లో ఉంది. అదే సమయంలో శవరయ్య బాలిక ఇంటికి వెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ నరసింహారావు కందులాపురం అడ్డరోడ్డు వద్ద నిందితుడు శవరయ్యను అరెస్టు చేశాడు.

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- దొనకొండ

ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని యర్రబాలెం గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా కారపూడి గ్రామానికి చెందిన కొందరు ఆటోలో కనిగిరిలోని పోలేరమ్మ దేవాలయం వద్దకు వెళ్లారు. మొక్కులు తీర్చుకొని స్వగ్రామానికి బయలు దేరారు. ఆటో యర్రబాలెం గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు, సిద్దేశ్వరరావు, నాగార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కురిచేడు వైద్యశాలకు తరలించారు.

పేదల గృహాలు తొలగించవద్దని ధర్నా

ప్రజాశక్తి - రేపల్లె

బేతపూడిలో రోడ్డు పక్కన తాత్కాలిక నివాసాల్లో నివాసం ఉంటున్న నాలుగు పేద కుటుంబాల ఇళ్లు తొలగించవద్దని, అధికారుల వేధింపులు ఆపాలని తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో రాజకీయ పరపతి కుటుంబం రోడ్డు పక్కన తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న వారి ఇల్లు తొలగించాలని పిటీషన్లు పెడుతూ ఇల్లు పడేపిస్తున్నామంటూ బెదిరిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని పేదలందరూ కలిసి శాశ్వత ఇల్లు లేక ఎప్పటినుంచో రోడ్డు పక్కనే నివాసం ఉంటున్న వారిని అక్కడే ప్రస్తుతం నివాసం ఉండేలాగా చూడాలని తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి ప్రజావిజ్ఞప్తుల్లో తహశీల్దారు ఎం శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రోడ్డు పక్కన తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్న పేదలను గత 6 నెలలుగా వెనుక స్థలానికి సంబంధించిన యజమాని, మాజీ ప్రజాప్రతినిధి కుటుంబం తమ ముందు ఎవరూ ఉండకూడదని, ఇల్లు తొలగించాలంటూ పేదలను బెదిరిస్తున్నారని అన్నారు. అధికారులకు పిటిషన్‌లు ఇస్తున్నారని, వీళ్ల అందరికి ఇళ్లస్థలాలు ఉన్నయంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. నిరాశ్రయులుగా ఉన్న పేదల ఇళ్లు తొలగించాల్సిందే అంటూ వివిధ రూపాల్లో ఒత్తిడి చేయటం సమంజసం కాదని అన్నారు. ఈ సమస్యపై పంచాయతీ, ఆర్ అండ్ బి అధికారులకు ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి ఇబ్బంది కలగజేయకుండా తాత్కాలికంగా నివాసం ఉంటున్నామని, శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకునే వరకు అవకాశం కల్పించాలని పేదలు వేడుకుంటున్నప్పటికీ అధికారులు ఇల్లు తొలగిస్తామంటూ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. పేదలు నివసిస్తున్న ఇళ్ళు కూల్చాలని అనుకుంటే ఐక్యంగా అండగా నిలబడతామని అన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్య పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. వారి పేర్లు చెప్పుకుంటూ పేదలును నిరాశ్రయులుగా చేయాలనుకుంటే ఇక్కడ ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులుకు కూడా చెడ్డ పేరు తెస్తుందని గమనించాలని అన్నారు. గత పది రోజులుగా రోజువారి పని చేసుకునే కుటుంబాల ఇల్లు కూలదోస్తారేమోనని పనులు మానుకుని ఇళ్ల దగ్గర కాపలా ఉంటూ మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. 70ఏళ్ల పైబడిన వారు, పూర్తి అంగ వైకల్యం కలిగిన మహిళ, చిన్నపిల్లలు మానసిక వేదనతో ఉన్నారని, ఆరోగ్యపరంగా ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. రాజకీయ కారణాలతో కాకుండా మానవతా దృక్పథంతో తాత్కాలిక నివాసాల్లో పేదలు నివాసం ఉండేలాగా తహశీల్దారు చూడాలని కోరారు. జై భీమ్ పార్టీ ఇన్చార్జ్ డి రమేష్ రాంజీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో స్వేచ్ఛగా నివసించే హక్కు ఉందని అన్నారు. నిరాశ్రయులుగా ఉన్నవాళ్లు తాత్కాలిక నివాసాల్లో ఉంటు ఎవ్వరికీ ఇబ్బంది లేనప్పటికీ వాటిని తొలగించాలని ఒక రాజకీయ పరపతి కుటుంబం బలవంతం చేస్తుంటే, పేదలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేయకూడదని అన్నారు. గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారనే నేపం కాకుండా ఈ కుటుంబాల వారికి ఈ ప్రభుత్వంలో శాశ్వత ఇళ్లు నిర్మాణం చేసినా అనంతరం తొలగించిన ఎవరికి ఇబ్బంది ఉండదని అన్నారు. అప్పటివరకు పేదలు చేసే న్యాయ పోరాటానికి మద్దతుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బేతపూడి గ్రామ పేదలు, సిపిఎం, జై భీమ్ పార్టీ నేతలు బి భాస్కర్, కె ఆశీర్వాదం, కెవి లక్ష్మణరావు, బాబురావు, శ్యామ్, కె రమేష్, వివిధ ప్రజాసంఘాలు నేతలు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వరద నీరు పోయే మార్గం చూపించండి

తహశీల్దారుకు ఐలవరం గ్రామ రైతుల వినతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అధిక వర్షాల సమయంలో పంట పొలాల్లోని నీళ్లు పారుదల అయ్యే కాలువ పూడిపోయి, ఆక్రమణకు గురైన దృష్ట్యా తమ పొలాలు నీట మునిగి నష్టపోవాల్సి వస్తుందని, తక్షణమే అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి తమ పంట పొలాలు కాపాడాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఐలవరం గ్రామ రైతులు సోమవారం తహశీల్దారు మేక శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పడమర వైపు ఉన్న 25ఎకరాల పంట భూమికి పాఠశాల ఆనుకుని ఉన్న మురుగు పారుదల కాలువ ఆక్రమణకు గురైనందు వలన ప్రతి ఏట అధిక వర్షాలకు పంట పొలాలు నీట మునిగి పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. మెరక ప్రాంతంగా ఉన్న ఈ పంట పొలాలు మురుగు పారుదలకు అవకాశం లేకపోవడంతో బాడవ పోలాల కంటే హీనంగా రోజుల తరబడి నీరు నిలబడి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పంట భూములకు సంబంధించిన మురుగు కాలువ పాఠశాల ప్రహరీ గోడ పక్కగా గ్రామ ప్రధాన రహదారికి తూము ద్వారా బయటికి వెళ్లి అక్కడి నుండి ఎన్టీఆర్ బొమ్మ ఎదురుగా వెళ్ళి ఎస్టీ కాలనీ మీదుగా మునసబు గారి రైస్ మిల్లు ఎదురు నుండి దళితవాడ ప్రక్కగా పైడమ్మ చెరువులో కలుస్తుందని తెలిపారు. అక్కడ నుండి అల్లూరు కాలువలోకి ప్రవేశిస్తుందని వినతి పత్రంలో వివరించారు. పాఠశాల ఎదురుగా రహదారి పక్కన నీరు పారుదల కావాల్సిన ఈ రహదారి పూర్తిగా ఆక్రమణకు గురైందని తెలిపారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా తాము రూ.వేలు వెచ్చించి నాట్లు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి సుధాకర్, ఎం సత్యనారాయణ మాట్లాడుతూ గతేడాది నాట్లు పూర్తయిన అనంతరం కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగిందని తెలిపారు. వర్షపు నీళ్లు పారుదల అయ్యే పరిస్థితుల లేక రోజుల తరబడి నీరు నిలబడి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మురుగు కాలువలు ఆక్రమణకు గురికావడం, పూడిపోవడం వలన రైతులు నష్టపోతున్నారని, ఐలవరం గ్రామంలో కూడా మెరక భూములు సైతం నీట మునిగి పంటలు దెబ్బ తిటుంటే రైతు ఏ విధంగా కోలుకుంటారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆక్రమణలు తొలగించి పూడికి తీత చేపట్టి పంట పొలాలు రక్షించి, రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందించిన తహశీల్దారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన కాలువను తక్షణమే పరిశీలించి సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి రైతులకు ఇబ్బంది లేని విధంగా అక్రమణలు తొలగించి నీరు పారుదలయ్యే విధంగా చూడాలని విఆర్ఒను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆ ప్రాంత రైతులు, నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఐలవరం గ్రామస్తులు

ఉగ్రవాదం సమాజానికి ప్రమాదకరం

ఎన్‌సిసి విద్యార్థులకు యాంటీ టెర్రరిజంపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

ఉగ్రవాదం దేశానికి, సమాజానికి ఎంతో ప్రమాదకరమని చీరాల రూరల్ శేషగిరిరావు అన్నారు. చీరల ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సిఐటిసి ఫోర్స్ ఎన్‌సిసి క్యాంపులో కమాండెంట్ లెఫ్టినెంట్ కాల్నల్ ఎన్ఎస్ పర్మార్ ఆదేశాల మేరకు యాంటీ టెర్రరిజంపై ఎన్‌సిసి విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ శేషగిరిరావు మాట్లాడుతూ ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమో వివరించారు. ఉగ్రవాదుల ఆలోచనలు, వారి కార్యకలాపాల గురించి తెలిపారు. ఉగ్రవాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. దేశ భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎన్‌సిసి విద్యార్థులకు ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఎలా స్పందించాలో వివరించారు. తాను కూడా ఎన్‌సిసి పూర్వ విద్యార్థినని చెప్పేందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఆపరేషన్ సింధూరిలో ఇద్దరు వీరవనితలు సల్మాన్ ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ పాల్గొని ప్రపంచ దేశాల్లో మహిళలు ఎందులో తక్కువ కాదని నిరూపించారని గుర్తు చేశారు. అనంతరం ఎన్‌సిసి అధికారులు సిఐ శేషగిరిరావును సత్కరించారు. కార్యక్రమంలో ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్, సుబేదార్ మేజర్ నజీర్ అహ్మద్, అడ్జడెంట్ మేజర్ రాజు, సుభేదర్ ముఖేష్, అవతార్ సింగ్, బి హెచ్ఎం రమేష్, ఎఎన్ఓ ఎస్ హరీష్, రాజేష్, పి సురేష్, టి వెంకటేశ్వర్లు, సిహెచ్ సుబ్బారావు, పావని, ఫాతిమా, హవల్దార్ పాల్గొన్నారు.

సిఐ శేషగిరిరావును సత్కరిస్తున్న ఎన్‌సిసి అధికారులు

అత్యుత్తమ విద్యా బోధన

ప్రజాశక్తి - నగరం

ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన విద్య అందిస్తూ ప్రణాళిక బద్ధమైన ఒత్తిడి లేని విద్యా విధానాన్ని అందించడం ద్వారా తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మండలంలోని ఈదుపల్లిలోని ఆక్స్‌ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ యోనో బాబు తెలిపారు. తమ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో విజయ దుందుభి మోగించినట్లు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరైన 35 మంది ఉత్తీర్ణలైనట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించారని తెలిపారు. వీరిలో 13మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థిని పాలెం గీతిక 589 మార్కులు సాధించి మండల స్థాయిలో రికార్డు నెలకొల్పారని తెలిపారు.

ఆక్స్‌ఫోర్డ్ డైరెక్టర్ యోనోబాబు

మంత్రి అనగానికి చెక్కు అందిస్తున్న నరేంద్ర వర్మ

మహానాడుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - బాపట్ల

ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సోమవారం పరిశీలించారు. మహానాడు విజయవంతంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్రం నలు మూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప మహానాడుకు రూ.10లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు నరేంద్ర వర్మ అందజేశారు.

పొగాకు పరిశీలిస్తున్న ఎఒ పి శ్రీనివాసరావు

నల్లబర్లీపై వివరాల సేకరణ

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపాడు మండలంలో అధికంగా నల్లబర్లీ సాగు చేసిన గ్రామాల్లో వ్యవసాయ అధికారి పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నల్లబరిలీ పొగాకు వివరాల సేకరణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతుల వద్ద ఎంత బర్లీ పొగాకు నిల్వ ఉందని, మండేలు చూసి అంచనా వేయమని ప్రభుత్వం పురమాయించిందని తెలిపారు. బర్లీ రూ.5వేల నుండి రూ.12వేల వరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు తెలిపారు. పొగాకు నిల్వలను రైతు వారీగా యాప్‌లో అప్లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. పమిడిపాడు, రాచపూడి గ్రామాలను పరిశీలించి ఎక్కువ సాగు దళిత రైతులే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న సిద్దు వెంకట సుబ్బారావు

ముప్పవరం వాసికి లెజెండ్ అవార్డు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధి వెంకట సుబ్బారావును విశ్వకర్మ లెజెండ్ అవార్డు వరించింది. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవస్థాపక చైర్మన్ విశ్వనాధుల పుష్పగిరి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో ప్రతిభ కనపర్చిన వారికి విశ్వకర్మ లీడర్, విశ్వకర్మ యంగ్ లీడర్, విశ్వకర్మ లెజెండర్ అవార్డులను ప్రధానం చేశారు. సేవా, సామాజిక రంగం, వృత్తి పరంగా వివిధ రకాల సేవలు చేస్తున్న సిద్దు వెంకట సుబ్బారావును గుర్తించి అవార్డు అందజేశారు. కార్యక్రమానికి తెలంగాణ క్రైమ్ బ్రాంచ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు కె కిరణ్ కుమార్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆకారం శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి సొల్లేటి ప్రభాకర్ ఆచారి, కొండేపి గణేష్ బాబు, విశ్వకర్మ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
మంగళవారం 27 మే 2025

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మద్దిపాడు

ఉరుకులు, పరుగులు జీవితంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్ యోగాసానాలు వేసి ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస ఉంచి మనసును, తనువును ఏకం చేసే ప్రక్రియే యోగా భ్యాసనమని తెలిపారు. ఒత్తిడితో కూడిన నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతితో మమేకం అవుతూ యోగా సాధనే దీనికి ఉత్తమ మార్గమని తెలిపారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రజల్లో దీని పట్ల మరింత ఆసక్తి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ సంతోషం, ఆరోగ్యం, సంపన్నవంతమైన సమాజ ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా నెల రోజులపాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఆర్డిఒ లక్ష్మీ ప్రసన్న, జిల్లా ఆయుష్ అధికారి బైద్యనాథ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు పద్మజాతి, శిరీష, మందిర ఇఒ నాగేశ్వరరావు, ఎంపిడిఒ శ్రీనివాస్ వరప్రసాద్, తహశీల్దారు నారాయణరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, పోతినేని శ్రీనివాసరావు, మారినేని రాఘవ, బోడపాటి రామకృష్ణ, ముల్లూరి మురళి, పతంజలి యోగా సంస్థ ప్రతినిధులు సుధీర్, రవి, గుప్తా, నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ హజీరా తదితరులు పాల్గొన్నారు.

యోగాసానాలు వేస్తున్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే

నాగులుప్పలపాడు : యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగ గురువు కె. శంకరరావు తెలిపారు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో యోగాసానాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ప్రసాదు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : యోగాతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని జరుగుమల్లి ఎంపిడిఒ రమణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి అధికారులు సోమవారం యోగాసానాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పోటీ జీవనశైలి మానసిక ఆరోగ్య రుగ్మతలకు దారితీస్తుందని తెలిపారు. ఇది వ్యాధి భారాన్ని పెంచే ఇతర సమస్యలకు దారితీస్తుందన్నారు. ప్రశాంతంగా ఉండటం, మనస్సును అదుపులో ఉంచుకోవడం కోసం యోగా తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బత్తల నాగేంద్ర వదన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .

ప్రకృతి వ్యవసాయ ఆహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ఒక అడుగు ముందుకు వేశారు. ఇప్పటి వరకు ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, లాభాలు అవగాహన కల్పిస్తూ వచ్చిన ప్రకృతి వ్యవసాయ అధికారులు, ఇప్పుడు గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. టంగుటూరు మండల కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ ద్వారా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు విక్రయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం సుభాషిణి, ఏవో స్వర్ణలత సహకారంతో ప్రతి సోమవారం మండలం ఆఫీస్ వద్ద స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు ఆకుకూరలు, కూరగాయలు ప్రజలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు, ఐసిఆర్‌పిలు పద్మావతి, హరిత, శశి, జ్యోత్స్న, త్రివేణి, రమాదేవి, కవిత, మరియమ్మ పాల్గొన్నారు.

కొండపి : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి మంచిదని యూనిట్ ఇన్‌ఛార్జి రంజిత్ తెలిపారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూర గాయలను విక్రయించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూర గాయలను అమ్మడం ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సొంతగహాలు, కిచెన్ గార్డెన్‌లో కూరగాయల మొక్కలు సాగు చేస్తే స్వచ్ఛమైన, ప్రకృతి కూరగాయలు లభిస్తాయని తెలిపారు. డబ్బు కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గోపీనాథ్,ఎస్‌జిహెచ్ సభ్యులు, ఐసిఆర్‌పిలు జ్యోత్స్న, మాలకొండయ్య, గౌతమి,తిరుమల, విజయలక్ష్మి, మాధవ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కళలు, కళా రంగానికి పేరు గాంచిన ఒంగోలులో సంగీత కళాశాల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఒంగోలు సిటిజెన్ ఫోరం కమిటీ విజ్ఞప్తి చేసింది. సిటిజెన్ ఫోరం నాయకులు కొల్లా మధు, నూకతోటి శరత్ బాబు, మారెళ్ళ సుబ్బారావు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఒంగోలులో మ్యూజిక్ కళాశాల, ఆడిటోరియం ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులైన టంగుటూరి ప్రకాశం పంతులు, మూవీ మొఘల్ డాక్టర్ డి.రామానాయుడు , ప్రముఖ నటీమణి ,సినీసంగీత దర్శకురాలు గాయని డాక్టర్ భానుమతి , ప్రముఖ హీరోయిన్ కాంచన విప్లవ కథానాయకుడు నిర్మాత రెడ్ స్టార్ మాదాల రంగారావు ప్రముఖ నిర్మాత ,దర్శకుడు ,నటుడు గిరిబాబు ప్రసాద్ బాబు , విజయచంద్ కె.విజయ , నిర్మాత పోకూరి బాబూరావు నల్లూరి వెంకటేశ్వర్లు, దర్శకులు టి.కృష్ణ మాటల మాంత్రికులు, నటుడు యం. యస్ .హరనాథ్ రావు ఇసుకపల్లి మోహనరావు,మరుదూరి రాజా , దర్శకుడు బి.గోపాల్, సంగీత దర్శకులు వందేమాతరం శ్రీ నివాసరావు, హీరోలు దగ్గుబాటి వెంకటేష్ , గోపిచంద్,మాదాల రవి ,వేణు తదితరులు జన్మించిన గడ్డ ప్రకాశం జిల్లా అని తెలిపారు. జిల్లాలో పూర్తి స్థాయిలో సంగీత కళాశాల మరియు ఆడిటోరియం లేకపోవడంతో ,దురదృష్టకరమని తెలిపారు. పరిషత్ నాటికలు, సాంఘిక నాటికలు ,జానపద నాటికలలో నటించే నటీనటులు ,వామపక్ష భావాలు కలిగి ఉన్న కళాకారులు అనే మంది ఉన్నా, సంగీత కళాశాల, ఆడిటోరియం లేకపోవడం ఎంతో బాధాకరమని తెలిపారు.

బ్యాంకు అధికారుల తీరు పట్ల..

డ్వాక్రా మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి-పొన్నలూరు

యూనియన్ బ్యాంకు అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా సిసిఎల్, ఆండ్రాయిడ్ అమౌంట్లు ఇతర ఖాతాలకు నగదు ఎలా బదిలీ చేస్తారంటూ బ్యాంకు అధికారులపై శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలు మాట్లాడుతూ తమ సంతకాలు, డాక్యుమెంట్స్ లేకుండా నగదు బదిలీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయం గురించి బ్యాంకు మేనేజరు, ఫీల్డ్ ఆఫీసర్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు తెలిపారు. మేనేజరును అడిగితే ఫీల్డ్ ఆఫీసర్‌ను అడగమని చెప్పినట్లు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్‌ను అడిగితే ప్రింట్ ఇస్తానని చెప్పి తర్వాత ప్రింటర్ మిషన్ పనిచేయటంలేదని చెప్పినట్లు తెలిపారు. ఇదేమని అడిగితే మరో సారి రుణాలు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. గతంలోనూ వెంకుపాలెం గ్రామానికి చెందిన ఓ పొదుపు గ్రూపు ఖాతాలో వారికి తెలియకుండా రూ. 20 లక్షలు బదిలీ చేసినట్లు తెలిపారు. నాలుగు నెలల తర్వాత ఈ విషయాన్ని గుర్తించి వెలుగు కార్యాలయానికి వెళ్లి తాము రుణాలు ఎప్పుడు తీసుకున్నామని ప్రశ్నించగా వారు తమకు తెలియదని చెప్పినట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ కుమ్మక్కై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మహిళలను బెదిరించి లోన్ క్యాన్సిల్ చేసి మళ్లీ కొత్త లోన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవకతవకలకుపాల్పడుతున్న బ్యాంకు అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 500 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 900పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు చీమకుర్తి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు బహుమతు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి కాలంలో విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్య నేర్చుకోవడం ద్వారా సమాజంలో తమ విలువలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ వైద్యుడు డాక్టర్ గోపికృష్ణ ప్రముఖ గుండె వైద్య నిపుణులు కె. వెంకటేశ్వర్లు, జిల్లా చేనేత అధికారి అనుముల వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, కౌన్సిలర్ సోమా శేషాద్రి, ఉపాధ్యాయులు పల్లెల రమేష్ కుమార్, తిరువెంగళం, నావికాదళ ఉద్యోగి తాటికొండ వెంకట సుబ్బారావు, పెన్షనుదారుల సంఘం నాయకులు దోమల పుల్లయ్య, నాయకులు దొంతు వెంకటరావు, అవ్వారు ఆదినారాయణ, జి. శ్రీనివాసరావు, నూకల రాఘవ, బుడ్డా బత్తిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ మండలం శానంపూడి అంబేద్కర్ నగర్ కాలనీ, మిట్టమీద పాలెంకు చెందిన దాసరి ప్రణీత, వెలిశాల లిఖిత, కంచర్ల అమత వర్షిణి, దార్ల సంయుక్త, కూతల ప్రదీప్తి స్థానిక బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలికలకు తమ విద్యార్థి దశలో మొదటి పోటీ పరీక్షగా గురుకుల పాఠశాలలు నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటుగా సమతుల్యమైన పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ సంవత్సరం గురుకుల పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థానం అధిరోహించాలంటే ఎంతో ఓపికతో అవసరమన్నారు. విద్యపై దృష్టి నిలిపి, కఠోర సాధన చేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ విద్యార్థుల విజయానికి కారణమైన శానంపూడి ఉన్నత పాఠశాల అధ్యాపక సిబ్బందికి, తల్లిదండ్రులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-టంగుటూరు

కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా స్థానిక రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి, ఒంగోలు ఉపాస్, స్విమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధికార ప్రతినిధి రావూరి తిరుమల రాధా కృష్ణ తెలిపారు. టంగుటూరులోని చెల్లెమ్మ తోటలోనున్న బ్రహ్మంగారి గుడి ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. టంగుటూరు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో కార్మికుల వినతి

ప్రజాశక్తి- కొత్తపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని మడనూరు, ఈతముక్కల, సూరారెడ్డిపాలెం ఆటో యూనియన్ కార్మికులు ఒంగోలు టూటౌన్ సిఐ మేడా శ్రీనివాసరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ యూనియన్‌లోని ఆటోలు సీరియల్ లేకుండా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నట్లు తెలిపారు. దీంతో యూనియన్‌లో ఉన్న ఆటోలకు ట్రిప్పులు కలవడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యూనియన్‌లో లేని ఆటోలు సీరియల్ లేకుండా నడిపితే అడ్డుకోవాలని తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ సీరియల్ లో ఉండి ఎలాంటి సమస్యలు లేకుండా ఆటోలు నడుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి స్వామిరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే రేషన్

ప్రజాశక్తి - కొల్లూరు

జూన్ 1 నుండి రేషన్ షాపుల నుండే నిత్యవసర సరుకులు పంపిణీ జరుగుతుందని తహశీల్దారు బి వెంకటేశ్వర్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారు తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లు, విఆర్‌ఒలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఒలు చౌక దుకాణాలకు వెళ్లి తనిఖీ చేయాలని, ఈపిఓఎస్ మిషన్లను ఎండియు ఆపరేటర్ల నుండి రేషన్ డీలర్లకు అందేదట్లు చూడాలని కోరారు. 1 నుండి 15 వరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతినెల 5వ తేదీలోపు వృద్ధులు, వికలాంగులకు ఇళ్లవద్దకే రేషన్ సరుకులు తీసుకెళ్లి ఇవ్వాలని సూచించారు. డీలర్స్ చౌకు దుకాణాలను పరిశుభ్రంగా ఉంచాలని, కార్డు ద్వారాలకు రేషన్ షాపు వద్దనే పంపిణీ జరుగుతుందని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ పిటి కృష్ణ

ఇంటి పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకా పెండింగు ఉన్న ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని డిప్యూటి ఎంపిడిఒ పిటి కృష్ణ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలేత్తకుండా చూడాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగేష్, మోహన్ బాబు, శ్రీను, శరత్, రాణి, తేజ, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు

పార్కుల కోసం స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో రాష్ట్ర గ్రీన్ కార్పొరేషన్ సహకారంతో పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్లు గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, ప్రజ్ఞ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డితో కలిసి పట్టణంలో పురపాలక సంఘానికి చెందిన ఖాళీ స్థలాలు పరిశీలించారు. పట్టణంలో ఒకటి, రెండు వార్డులు రామకృష్ణాపురంలోని పురపాలక సంఘానికి చెందిన 3.39ఎకరాల విస్తీర్ణంలోని చెరువు, కర్లపాలెం రోడ్డు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఎదురుగా ఉన్న 1.08ఎకరాల మున్సిపల్ స్థలాన్ని గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులు పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ఆయా స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రీన్ కార్పొరేషన్ సహకారంతో పట్టణంలో త్వరలో రెండు నూతన పార్కులు ఏర్పాటుకు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచనల మేరకు త్వరలోనే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అన్నారు. వారి వెంట ఇంజనీర్ ఎస్ఎస్ఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధించాలి

ప్రజాశక్తి - బాపట్ల

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ బి సుబ్బారావు అన్నారు. తూర్పు బాపట్ల పంచాయతీ పరిధిలోని నందిరాజుతోటలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి గ్రామసభలో ఆయన మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని సమూలంగా నిర్మూలించేందుకు పంచాయతీ, సచివాలయ సిబ్బంది, అధికారులకు ప్రజల సహకరించాలని అన్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తేనే భవిష్యత్తులో ప్లాస్టిక్ కాలుష్య కోరల నుండి ప్రజలను కాపాడుకోగలమని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులై ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు లేనిదే తెల్లారని ఈ రోజుల్లో దానివల్ల కలిగే అనర్ధాలను ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరు గుడ్డ సంచులు వాడాలని

ప్లాస్టిక్ నిషేధంపై తూర్పు బాపట్లలో ర్యాలీ

అన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, మరీదు వెంకటేశ్వర్లు, అద్దంకి శ్రీనివాసరావు, కరి మీరయ్య, నక్కా జయశీలరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పాలకులలకు పట్టని పేటేరు రహదారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఓలేరు పంచాయతీ పరిధిలోని వెంకటరాజు నగర్ గ్రామం నుండి పేటేరు వరకు ఉన్న జిల్లా పరిషత్తు రహదారి అభివృద్ధి పాలకులకు పట్టదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం గ్రామ ఏర్పడింది. అప్పటి నుండి ఇక్కడ ప్రజలు పేటేరు, రేపల్లె వంటి ప్రాంతాలకు వెళ్లడానికి ప్రధాన రహదారి ఈ మార్గం. ఇరువైపులా పంట పొలాలు, రహదారి వెంట చెట్లు పెరిగి ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రమాద భరితంగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. అప్పటి నుండి ఈ రహదారి అభివృద్ధి పర్చాలని పదేపదే పాలకుల వెంటపడిన పట్టించుకున్న నాధుడే లేడని వాపోతున్నారు. సుమారు కిలోమీటర్ మేర ఉన్న ఈ రహదారిలో వెంకట్రాజు నగర్‌తో పాటు తూర్పుపాలెం, పల్లెపాలెం గ్రామస్తులు కూడా ప్రయాణిస్తూ ఉంటారు. ఈ గ్రామాల ప్రజలు వైద్య సేవలు, ఇతర కార్యకలాపాలకు నిత్యం పేటేరు, రేపల్లె ప్రయాణిస్తూ ఉంటారు. అత్యంత దగ్గర మార్గంగా ఉన్న ఈ రోడ్డు పూర్తిగా గుంటలు పడిపోయి రాకపోకలకు అనుకూలంగా లేదు. అయినప్పటికీ గత్యంతరం లేక ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తూ ఉంటామని ఆయా గ్రామాల

ఓలేరు వెంకటరాజు నగర్, పేటేరు రహదారి

ప్రజలు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు తమ ప్రభుత్వం అధికారం చేపట్టగానే రహదారిని అభివృద్ధి చేస్తామని మాటలు చెప్పటమే తప్ప దానిని నెరవేర్చిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిలలు అనారోగ్యానికి గురైతే రేపల్లె వైద్యశాలకు వెళ్లటానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి ఈ మూడు గ్రామాల ప్రజలు ఈ రహదారితో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని ఆ ప్రాంతవాసులు కోరుచున్నారు.

రోడ్లకు నిధులు కేటాయించడం పట్ల హర్షం

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు, పర్చూరు రహదారి నిర్మాణానికి రూ.23.88 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల తెలుగుదేశం శ్రేణుల్లో ఆనందం కనిపించింది. వైసిపి ఐదేళ్ల పాలనలో రహదారులు అభివృద్ధి, మరమ్మతులు లేక ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవించారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులకు మహర్దశ పట్టిందని తెలుగుదేశం శ్రేణులు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నేతలు సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వాహన శ్రేణిగా వంకాయలపాడు, పూసపాడు బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమంటూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, తిరుమల శెట్టి శ్రీహరి, షేక్ షంషుద్దీన్, బేతపూడి సురేష్ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామీణ రహదారుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులతో ప్రయాణికుల కష్టాలకు చెక్ పెట్టారని పేర్కొన్నారు. వైసీపీ నేతల

పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

వక్రబుద్ధితో గత ఐదేళ్లు ఇంకొల్లు, పర్చూరు రహదారి అభివృద్ధికి నోచుకోలేదని మండిపడ్డారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో మంజూరైన అనేక రహదారుల అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిందని ఆరోపించారు. కాంట్రాక్టర్‌ను వేధించి పనులు నిలిపి వేశారని అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పట్టుబట్టి పర్చూరు, ఇంకోల్లు రహదారి నిర్మాణానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని పలుమార్లు కలిసి రోడ్డు దుస్థితిని వివరించారని తెలిపారు. రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, కాసిం, పేర్ని బాపయ్య, కర్రి శ్రీనివాసరావు, దండ శ్రీనివాసరావు, మార్కు, కరణం రమేష్, గోరంట్ల సురేష్, సతీష్, బండ్ల శ్రీనివాసరావు, సాంబయ్య, సీతారామయ్య, మీరావలి, చిలుకూరి శ్రీనివాసరావు, మస్తాన్‌బాబా, వెంకట్రావు, రఘురాం, శ్రీనివాసరావు, భాస్కర్, రమాదేవి, కర్రీ నాగేంద్రమ్మ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంఇఒ ఎ శ్రీనివాసరావు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్ని గుర్తిస్తున్నట్లు ఎంఇఒ ఎ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జీరో నుండి 18ఏళ్ల వరకు వివిధ రకాల మానసిక, శారీరక దివ్యాంగులైన పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ఆరోగ్య కార్యకర్తలను కలిసి వైకల్యం ఉన్న పిల్లల సమాచారం నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎనిమరేటర్స్‌గా ఐఇ రిసోర్స్ పర్సన్ వి వీరయ్య సర్వే చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు క్రొత్తగా ముగ్గురు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ఇలా గుర్తించిన పిల్లలకు మెడికల్ సర్టిఫికెట్లు, ఎడ్యుకేషన్‌కు సంబంధించిన రాయితీలు, సామాజిక, దివ్యాంగుల పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. దైనందిన జీవితం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం కలిగిన వారికి కావాల్సిన వివిధ పరికరాలు సమగ్ర శిక్ష ద్వారా అందించనున్నట్లు తెలిపారు.

వెంకటరెడ్డికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వెంకటరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - మెదరమెట్ల

మండలంలోని పమిడిపాడు గ్రామ మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షులు కేసరి వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కర్మ కృష్ణంరాజుపాలెంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైసిపి ప్రముఖులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర విభాగ బాధ్యులు వైవి భద్రారెడ్డి, ఇంచార్జ్ పాణ్యం హనిమిరెడ్డి, ఈదా శ్రీనివాసరెడ్డి, కోయి అంకారావు, రావినూతల సుబ్బయ్య తోపాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు వెంకటరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

మహానాడుకు తరలి వెళుతున్న తెలుగుదేశం నాయకులు

మహానాడుకు వెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

కడపలో జరుగుతున్న మహానాడుకు మండలంలోని తెలుగుదేశం నాయకులు సోమవారం తరలి వెళ్లారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని నియోజవర్గ మహానాడు నిర్వహించుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు మాట్లాడుతూ కడపలో ప్రతిష్టాత్మకంగా మహానాడు జరుగు తుందని అన్నారు. టిడిపి నాయకులు వలపర్ల సుబ్బారావు, ఆదిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి), అమర్తపూడి ఏసోబు (చిన్న), పొద రామాంజనేయులు, పోతిని ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు అద్దంకమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఈనెల 27న మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ దామా నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. 33వ వార్షికోత్సవ సందర్భంగా సిడి మాను బండి ఊరేగింపు అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ ఉంటుందని వంశపారంపర్య ధర్మకర్త కొల్ల సుబ్బారావు, పూజారులు తులసి తెలిపారు.

ప్రజాశక్తి
మంగళవారం 27 మే 2025

విఒఎ మీరాబీకి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - పంగులూరు

తాను గత 13ఏళ్ల నుండి పంగులూరు గ్రామంలో పంగులూరు-2 డ్వాక్రా మహిళా సమైక్య సంఘాలకు యానిమినేటర్‌గా పనిచేస్తున్నానని, తనను అన్యాయంగా తొలగించారని, తనకు తీరని అన్యాయం చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ షేక్ మీరాభి తహశీల్దారు పి సింగారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ 13 ఏళ్లలో ఎలాంటి అక్రమాలకు తాను పాల్పడలేదని పేర్కొన్నారు. డాక్రా మహిళా సంఘాల మద్దతు కూడా తనకు ఉందని వినతిపత్రంలో తెలిపారు. తనను అన్యాయంగా తొలగించడం వలన సంఘంలోని 32 మహిళా డ్వాక్రా గ్రూపులకు గత ఆరు నెలల నుండి ఎలాంటి రుణాలు రావడం లేదని తెలిపారు. డ్వాక్రా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రాయిని వినోద్ బాబు, తలపనేని రామారావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోకి రాజకీయాలు చేరాయని, అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చనే అహంకారంతో విఒఎలను అక్రమంగా తొలగించారని అన్నారు. ఎక్కడా లేనివిధంగా మండలంలో 18మంది విఒఎలను తొలగించారని తెలిపారు. ఇది చట్ట రీత్యా నేరం అన్నారు. మీరాభీని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఒఓలపట్ల రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. ఎపిఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తహశీల్దారు సింగారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తిరుమల పురపు వెంకాయమ్మ, తాతపూడి సత్యవతి, రావూరి శివమ్మ, పాలపర్తి వెంకాయమ్మ, మంద మేరీ, తాళ్లూరి వజ్రం, ప్రజా కళాకారుడు జాన్ సాహెబ్ పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న మీరాబి

ఆర్డీఒకు వినతి పత్రం అందజేస్తున్న యన్నం సురేష్

పొలంలో రోడ్డు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక గ్రామంలో ఒక దళిత రైతు కుటుంబంపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు అనేకమార్లు దాడులు చేసి 40ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన సాగు భూమిని అన్యాయంగా ఆక్రమించి పొలం మధ్యలో రోడ్డు వేశారని, దానివలన ఇరువైపులా ఉన్న పంట పొలాలు వర్షం నీటికి దెబ్బతింటున్నాయని గ్రామానికి చెందిన అన్నం సురేష్ రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మికి వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ విషయంపై అనేక సార్లు రెవెన్యూ, పోలీసు అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ పట్టించుకోలేదన్నారు. అక్రమంగా రోడ్డు వేసిన 16 మంది నిందితులపై కేసు నమోదు చేయాలని, పొలం మధ్యలో రోడ్డు వేయటం వలన ఇటీవల కురుస్తున్న అధిక వర్షాలకు పొలంలో అధిక నీరు చేరి మామిడి మొక్కలు, ఆకుకూరలు, పశుగ్రాసం పూర్తిగా దెబ్బతినే పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆ వర్షపు నీరు ఇలాగే ఉంటే అధిక మొత్తంలో నష్టపోతానని ఆందోళన వ్యక్తం చేశారు. తన పొలంలో అక్రమంగా వేసిన రోడ్డు తొలగించి, పొలంలోని నిల్వ ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా చేసి తనకు న్యాయం చేయమని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోరాడు.

విద్యుత్ స్థంభం కూలడంతో పగిలిపోయిన రేకులు

దుకాణంపై కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - చీరాల

టిఫిన్ దుకాణంపై విద్యుత్ స్తంభం కూలి పడటంతో దుకాణం రేకులు పగిలిపోయాయి. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని కొత్తపాలెంలో ఆదివారం రాత్రి జరిగింది. కొత్తపాలెం పంచాయతీ పాత ఊరులో నివాసం ఉంటున్న మల్లికార్జునరెడ్డి అదే గ్రామంలో టిఫిన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భారీవర్షానికి ఈదురు గాలులు తోడు కావడంతో విద్యుత్ స్తంభం కూలి టిఫిన్ దుకాణంపై పడింది. అయితే ఆ సమయంలో ఎవరు అక్కడ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో దుకాణం రేకులు పగిలిపోయాయి. విద్యుత్ తీగలు తెగి ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళన చెందారు. ఇది ఇలా ఉంటే విద్యుత్ స్థంభం విరిగిపడినప్పటికీ విద్యుత్ అధికారులు మాత్రం స్పందించకపోవడంతో స్థానిక ప్రజలు అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్తు అధికారులు స్తంభాన్ని తొలగించాలని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తెలుగుజాతికి సజీవ సాక్ష్యంగా 'బాపట్ల'

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగుజాతి అస్తిత్వ సాధనలో బాపట్ల అద్వితీయమైన పాత్ర పోషించిందని ఫారం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయి బాబా అన్నారు. ప్రథమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాలు ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శతాబ్ది ఉత్సవాల స్థూపం వద్ద తెలుగు తల్లి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ ఇక్కడే రూపుదిద్దుకుందని అన్నారు. ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు బాపట్లలోనే బీజం పడిందని అన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందని అన్నారు. తెలుగువారి ఐక్యతకు అది ఎంతో ఊతమిచ్చిందని అన్నారు. టౌన్ హాలులో జరిగిన మహాసభలు భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు మరింత బలం చేకూర్చిందని అన్నారు. 1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు కూడా బాపట్లలోనే బీజం పడిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి దుర్గా ప్రసాదరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు కోట వేంకటేశ్వరరెడ్డి, న్యాయవాది జమ్రుద్ బాష, విశ్రాంత ఆచార్యులు కె విజయ కుమార్, కేశవులు, పనసాల, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

ఆటల్లో గెలుపోటములు సహజమే..

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఆటల పోటీల్లో గెలుపు, ఓటములు సహజమేనని, ఓడినవారు గెలుపు కోసం పోటీ పడాలని, క్రికెట్ పోటీల్లో మొదటి, రెండో బహుమతి గెలుచుకున్న విజేతలను టిడిపి నాయకులు బేతపూడి రామారావు అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో ముండ్లమూరు మెగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంటుకు జిల్లా నలుమూలల నుండి 60 టీంలు పాల్గొని 25రోజుల నుండి హెూరాహెూరీగా తలపడ్డారు. సోమవారం మూడు టీములు మధ్య జరిగన పోటీలో ఉదయం నాయుడుపాలెం చేగువేరా టీం 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేయగా, తాళ్లూరు మండలం రమణాలవారిపాలెం టీం 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసి విజయం సాధించారు. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముండ్లమూరు మెగా ఫ్రెండ్స్ యూత్, రమణాలవారిపాలెం జట్లు మధ్య పోటా పోటీగా జరిగింది. ఈ పోటీలో రమణాలవారిపాలెం టీం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 83 పరుగులు చేయగా, 84 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ముండ్లమూరు మెగా ఫ్రెండ్స్ యూత్ టీం 9.4 ఓవర్లలో మూడు వికెట్లు నష్టానికి 84 పరుగులు చేసి విజయం సాధించారు. టోర్నమెంట్లో విజయం సాధించిన టీంలకు మొదటి బహుమతి రూ.25116 బేతపూడి రామారావు, రావూరి దుర్గాప్రసాద్ విజేతలకు అందజేశారు. రెండో బహుమతి రూ.15116 మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, టిడిపి యువ నాయకుడు మేదరమెట్ల అచ్చయ్య అందజేశారు. మూడో బహుమతి రూ.10116 టిడిపి యువ నాయకులు ఆనెం నాగేశ్వరరావు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గండి జాన్ పాల్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కత్తి బాబు కైవసం చేసుకున్నారు. క్రికెట్ టీంలకు టీ షర్టులను కుమిత పేరారెడ్డి బహుకరించారు. క్రికెట్ పోటీలకు మేదరమెట్ల వీరనారాయణ, వీరపనేని శ్రీనివాసరావు, తాతపూడి పెద్ద రోశయ్య, తాతపూడి ప్రవీణ్, తాతపూడి సాలెంరాజు, గంధం జాకబ్ మరికొన్ని బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, రావూరి దుర్గాప్రసాద్, సోమేపల్లి శ్రీనివాసరావు, కుమిత పేరారెడ్డి, ఆనం నాగేశ్వరరావు, నంబూరి దానియేలు, మెగా ఫ్రెండ్స్ యూత్ పాల్గొన్నారు.

ఎస్సీ పల్లెలకు స్మశాన స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - రేపల్లె

రేపల్లె డివిజన్ పరిధిలో స్మశాన వాటికలు లేని ఎస్‌సి పల్లెలను గుర్తించి స్థలాలను కేటాయించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రేపల్లె ఆర్డీఒకు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. రాజ్యాంగం అమలులోనికి వచ్చి 75ఏళ్లు గడుస్తున్నప్పటికీ అనేక పల్లెలు నేటికీ స్మశాన వాటికలకు స్థలాలు లేక గట్టులు, పుట్టలు, డొంకల వెంబడి చనిపోయిన వ్యక్తులను ఖననం చేయవలసి రావడం శోచనీయమని అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం ద్వారా రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ స్మశాన వాటికలకు స్థలాలు కొనివ్వడానికి ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం ఎస్సీల పట్ల పాలక ప్రభుత్వాలకు ఉన్న వివక్షతా వైఖరికి నిదర్శనం అన్నారు. తక్షణం స్థలాల కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేరుసు వెంకటరావు నాయుడు, కర్రా బాబురావు, తురిమెళ్ళ శ్యామ్ పాల్గొన్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక తండ్రి మృతి

ప్రజాశక్తి - పర్చూరు

పి హరిబాబు (65)

పోట్రు మణికంఠ (35)

మండలంలోని నాగులపాలెంలో అనారోగ్యంతో కుమారుడు అకాల మరణం తట్టుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గ్రామస్థులను కలచి వేసింది. గ్రామానికి చెందిన పోట్రు మణికంఠ (35) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొడుకుని బ్రతికించుకోవాలని రూ.లక్షలు ఖర్చు చేసి తండ్రి వైద్యం చేయించాడు. చివరకు ఆదివారం రాత్రి మణికంఠ మృతి చెందాడు. కుమారుని మరణ వార్త తట్టుకోలేని తండ్రి హరిబాబు (65) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. గంటల వ్యవధిలో తండ్రీ కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

'యోగాంధ్ర' ర్యాలీ

ప్రజాశక్తి - అమృతలూరు

గ్రామాల్లో పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని, అదే రీతిలో ప్రతి ఒక్కరు యోగా చేయటం వలన ఆరోగ్యంగా ఉండటమే కాక పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపిడిఒ మారుతి శేషమాంబ సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, యోగాంధ్ర గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామంతో పాటు ఇంటి పరిసరాలు శుభ్రపర్చుకోవాలని అన్నారు. పరిశుభ్రత ద్వారానే అంటు వ్యాధులకు దూరంగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపిడిఒ పిటివి కృష్ణ

పి-4పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు సోమవారం పి4సర్వేపై అధికారులు, నాయకుల అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎంపిడిఒ లక్ష్మినారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అధికారులు, గ్రామ నాయకులు సమన్వయంతో పేదల అభివృద్ధికి ప్రయత్నం చేద్దాం అన్నారు. తహశీల్దారు రవి కుమార్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందితే అదే నిజమైన అభివృద్ధి అన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలు సహకారంతో ముందుకు వెళ్ళాలని అన్నారు. కార్యక్రమంలో ఎఒ మేరిమ్మ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత, కార్యదర్శులు శరత్, మోహన్ బాబు, రాణి, అశోక్, ప్రభాకర్, శ్రీను, నాయకులు రావిపాటి సీతయ్య, వి వీరయ్య, రంగయ్య చౌదరి, తారక, వంశీ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా వినయ్‌కుమార్

ప్రజాశక్తి - అద్దంకి

మండల ప్రత్యేక అధికారిగా డీఎఫ్ఓ కె వినయ్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపిడిఒ బి సింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

కార్పొరేషన్ ఆదాయం పెంపునకు చర్యలు

- రాష్ట్రంలో నెంబర్ 1 స్థానంలో నిలపాలి
- మొండి బకాయిల వసూళ్లపై దృష్టి
- అధికారులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర పాలక సంస్థ ఆదాయాన్ని పెంచి రాష్ట్రంలో నెంబర్‌వన్ స్థానంలో నిలపాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సోమవారం ఎమ్మెల్యే దామచర్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులపై ఉందన్నారు. కార్పొరేషన్ పరిధిలో మొండి బకాయిల వసూళ్ళలపై ప్రత్యేక దృష్టి సారించి వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలకు చోటు లేకుండా షాపులలో అర్హులు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.. ఒంగోలు నగరంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కరోనా కేసులు నమోదవుతున్న సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు శానిటేషన్, మాస్కులు ధరించేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దామచర్ల సూచించారు. ఒంగోలు నగర పాలక సంస్థలో ఖాళీ స్థలాలలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చేపట్టాలన్నారు. ఒంగోలు నగర సుందరీకరణలో భాగంగా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. ఒంగోలు శివారు కాలనీలలో మంచి నీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నిధులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళి వాటిని రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, టి.రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, ఆదిపూడి శాండిల్య, ఈదర వెంకట సురేష్ బాబు, బేతంశెట్టి శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకం తిరిగి నిర్మించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పంచాయతీలోని పార్క్ వద్ద అనేక సంవత్సరాలుగా పంచాయతీరాజ్ అభివృద్ధి పనులకు సంబంధించి దళిత మహిళా సర్పంచ్ అయిన కొమ్ము సరోజనమ్మ పేరుతో శిలాఫలకం ఉంది. ఈ శిలాఫలకాన్ని కొన్ని నెలల క్రితం పంచాయతీ వారు తొలగించారు. కనీసం శిలాఫలకాన్ని పంచాయతీ కార్యాలయంలో భద్రపరచకుండా నిర్లక్ష్య ధోరణితో పార్కులో ఓ మూలన పడేశారు. దళితుల పట్ల మీకు ఉన్న చిన్న చూపు కారణంగానే మీరు శిలాఫలకాన్ని తిరిగి నిర్మించలేదని భావిస్తున్నామని టంగుటూరు మాజీ యం.పి.టి.సి బొడ్డు సతీష్ టంగుటూరు పంచాయతి కార్యదర్శికి సోమవారం నాడు లేఖ రాశారు. తక్షణమే శిలాఫలకాన్ని తిరిగి నిర్మించాలని కోరారు.

మూలన పడి ఉన్న శిలాఫలకం

చీటింగ్ కేసులో బాలనాగేంద్రం అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రియల్ ఎస్టేట్‌లో మోసం చేశారని వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ జడా బాలనాగేంద్రంను ఒంగోలు తాలూకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మండవవారిపాలెంకి చెందిన ఎం.శ్రీధర్ మరికొందరితో కలసి జడా బాలనాగేంద్రం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. వ్యాపార లావాదేవీలలో తమను బాలనాగేంద్రం మోసం చేశాడని ఎం.శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. తాలూకా సిఐ విజయ్‌కృష్ణ జడా బాలనాగేంద్రంను విచారించి అనంతరం విడుదల చేశారు. కేసు విషయమై ఎప్పుడు పిలిచినా పోలీస్ స్టేషన్‌కు రావాలని సిఐ బాల నాగేంద్రంకు చెప్పినట్లు సమాచారం.

వైసీపీలో చేరిన బీజేపీ నాయకులు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

వైఎస్.రాజశేఖర్ రెడ్డి అనుచరులు వైవి యాదవ్ తనయులు వైవి అశోక్ గౌతమ్, అభిలాష్ యాదవ్ బిజెపిని వీడి వైసీపీ లో చేరారు. ఆదివారం రాత్రి జరిగిన ఒంగోలువైసీపీ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైస్సార్సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు , దర్శి శాసనసభ్యులు ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు అసెంబ్లీ సమన్వకర్త చుండూరి రవి బాబు ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. వీరి తండ్రి వైవీ యాదవ్ 1994లో ఒంగోలు శాసనసభకు పోటీ చేశారు. పార్టీలో చేరిన వీరితో పాటు పాటు శీలూరి అనిల్ బాబు, సుబ్బారావు, మల్లెల యశ్వంత్, చందు గణేష్ , రాఘవ తదితరులు ఉన్నారు.

కేన్సర్ నివారణలో మరో ముందడుగు

- ఐహెచ్‌సి పరికరం ఆవిష్కరణ
- ప్రారంభించిన జిజిహెచ్ సూపరింటెండెంట్ ఏడుకొండలరావు

ఐహెచ్‌సి పరికరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ఏడుకొండలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేన్సర్ నివారణలో మరో ముందడుగు పడింది. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అధునాతన ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ (ఐహెచ్‌సి) పరికరం అందుబాటులోకి వచ్చింది. ఈ పరికరం కేన్సర్ నిర్ధారణ, చికిత్సలో కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న పరికరాన్ని సోమవారం ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ (ఐహెచ్‌సి) పరికరం అందుబాటులోకి రావడం ప్రకాశం జిల్లావాసుల అదష్టమని, కేన్సర్‌పై పోరులో ఈ పరికరం బహుముఖ పాత్ర పోషిస్తుందన్నారు. వైద్య కళాశాలలో పిజి నిధులతో రూ.40 లక్షల విలువైన ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరికరాన్ని సమకూర్చామన్నారు. కేన్సర్ అనుమానం ఉన్న వారు లేదా ఎలాంటి కేన్సర్ సోకిందన్న విషయం ఈ పరికరం ద్వారా తెలుస్తుందన్నారు. కేన్సర్ కణాలలోని నిర్దిష్ట పాయింట్స్ గుర్తించడంలో ఐహెచ్‌సి సహాయపడుతుందని, వైద్యులు కేన్సర్ ఉపరకాన్ని ఖచ్చితంగా నిర్ధారించవచ్చన్నారు. చికిత్సకు అది ఎలా స్పందిస్తుందో అంచనా వేయడానికి ఐహెచ్‌సి పరికరం పాథాలజిస్టులకు సహాయపడుతుందని తెలిపారు. కేన్సర్ రోగులు ఎటువంటి మందులు ఎంత కాలం వాడాలన్నది కూడా ఈ పరికరం ఇచ్చే నివేదికను బట్టి వైద్యులు నిర్ణయిస్తారని అయన తెలిపారు. అనవసరమైన, అధిక డోజ్ మందులు వాడే ప్రమాదాన్ని ఈ పరికరం నివారిస్తుందన్నారు. వైద్యులు అత్యుత్తమ చికిత్సలను ఎంచుకోవడానికి ఈ ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ వీలు కల్పిస్తుందన్నారు. రొమ్ము, ఊపిరితిత్తుల కేన్సర్‌లో, పలు రకాల కేన్సర్లల్లో ఈ రకమైన క్యాన్సర్ సోకిందో ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఐహెచ్‌సి పరికరం ప్రకాశం జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని అయన కోరారు. ప్రివెంటివ్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజి విభాగాలను సంప్రదిస్తే అవసరమైన వారికి ఐహెచ్‌సి ద్వారా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశం జిల్లాలోని ప్రజలే కాకుండా ఇతర వైద్య రంగంలో ఉన్న సంస్థలు ఈ సేవలను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇందు కోసం పాథాలజీ డిపార్ట్మెంట్ వారినీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకరరావు, విభాగాధిపతి డాక్టర్ సుధాకర్, ఫీజియాలజి విభాగాధిపతి డాక్టర్ దుర్గాదేవి, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్ బాబు, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రీదేవి, మైక్రోబయాలజీ డాక్టర్ పద్మ ప్రియ, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిషన్‌బాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- దేశ సంపదను రక్షించుకుంటాం
- కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల నిరసన

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎందరో త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని పలువురు కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వానికి హెచ్చరించారు. సోమవారం నాడు ఒంగోలు కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడారు. ఒక పక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని చెబుతూనే దొడ్డిదారిన ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల కాలంలో నాలుగు వేల మందిని కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి మూడు నెలలుగా వేతనాలు నిలిపివేశారన్నారు. జీతాలు రాకుంటే, పని లేకపోతే ఫ్యాక్టరీ వదిలిపెట్టి వెళతారని కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి ప్రభుత్వ రంగంలో ఉంచాలని, లేనిపక్షాన విశాఖ ఉక్కుని రక్షించుకోవడానికి పోరాటాలు తప్ప వేరే మార్గం లేదని రంగారావు ప్రకటించారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకుంటామని, దేశ సంపదను రక్షించుకుంటామని ఆయన ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కుని రక్షించుకోవడానికి వ్యవసాయ కార్మికులంతా ఉద్యమిస్తారని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హనుమారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కును రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, అయితే ఈ ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఏపీఆర్పిఐ జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.వీరారెడ్డి, ఎస్‌డి.సర్దార్, శ్రీరామశ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బివి రావు, సిహెచ్ రాంబాబు, దామా శ్రీనివాసులు, జి.రమేష్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం

ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆయనను నిన్న మధ్యాహ్నం 2 గంటలకు గోవర్ధన్ అరెస్టు చేస్తే ఎక్కడ ఉంచారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారన్న కనీస సమాచారం కూడా లేకుండా గోప్యంగా ఉంచడం చట్టవిరుద్ధమని ఆయన సోమవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసు డిపార్ట్మెంట్‌కు లేకపోవడం విచారకరం అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ ఇటువంటి అక్రమ కేసులు నమోదు కాలేదన్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి సంస్కృతి లేదని, ఇది మంచి సంప్రదాయం కూడా కాదని అన్నారు. గోవర్ధన్‌రెడ్డిపై బనాయించిన అక్రమ కేసు విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కేసులో కాకాణి క్లీన్ చిట్ తో బయటికి వస్తారనే నమ్మకం తమకుందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేడర్ మొత్తం కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అండగా నిలుస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు అధికార పార్టీ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది అప్రజాస్వామ్యకం అని విమర్శించారు. ఇదే సంస్కృతి కొనసాగితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.